# నవభూమి కరీంనగర్

అనుబంధం

17 సెప్టెంబర్,2024 మంగళవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in




నేటి నుంచి వందేభారత్

# పరుగులు



**పెద్దపల్లి:-నవభూమి:** ఉమ్మడి జిల్లా మీదుగా సోమవారం నుంచి ప్రతిష్ఠాత్మకమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు తీయనుంది. నాగ్‌పూర్- సికింద్రాబాద్‌ల మధ్య నడిచే ఈ రైలును అత్యధికంగా 20 బోగీలతో నడపనున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 8, 16 బోగీలు కలిగిన వందేభారత్ రైళ్లు నడుస్తుండగా ఈరైలు అత్యధికంగా 1440 సీటింగ్ సామర్థ్యంతో నడపనున్నారు. విదర్భ, తెలంగాణ ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలు, ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో 20 బోగీలను అమర్చినట్లు తెలుస్తోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానం ద్వారా దీనిని ప్రారంభించనున్నారు. ఖరీదైన ప్రయాణం..సికింద్రాబాద్ - నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణం మిగతా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల టికెట్టుతో పోల్చితే ఖరీదు అధికంగా ఉంది. రామగుండం నుంచి సికింద్రాబాద్‌కు చైర్‌కార్‌లో ఒక్కరికి రూ.670, స్నాక్స్‌తో కలిపి రూ.865, ఎగ్జిక్యుటివ్ క్లాస్‌లో రూ.1305, భోజనంతో కలిపి రూ. 1510. రామగుండం నుంచి నాగ్‌పూర్‌కు చైర్‌కార్‌లో రూ.885, స్నాక్స్‌తో కలిపి రూ.925, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో రూ.1725, ఆహారంతో కలిపి రూ. 1805గా నిర్ణయించారు. తెలంగాణ లేదా ఇతర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రామగుండం నుంచి నాగ్‌పూర్‌కు 3టైర్ ఏసీ రూ.670, 2-ఏసీ 930, 1-ఏసీ 1545, సికింద్రాబాద్‌కు 3టైర్-ఏసీ 555, 2-ఏసీ 760, 1-ఏసీ 1255గా ఉంది. మన రాష్ట్రంలో కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, జమ్మికుంట, జనగామలో హాల్టింగ్ ఇవ్వాలనే డిమాండ్ ఉంది. తగినంత ఆదాయం సమకూరే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించే అవకాశముంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, జమ్మికుంటలో వందేభారత్‌కు హాల్టింగ్ కల్పించేందుకు ఇద్దరు ఎంపీలు చొరవతీసుకోవాల్సిన అవసరముందని ప్రయాణికులు అంటున్నారు. రాత్రి సమయంలోనే ప్రారంభ వేడుక వందేభారత్ రైలు రామగుండం స్టేషన్‌కు సోమవారం రాత్రి 8.20 గంటలకు చేరుకోనుండగా అప్పుడే స్థానికంగా ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే రైలుకు ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లు రామగుండం స్టేషన్‌లో స్వాగతం పలికి అనంతరం నాగ్‌పూర్‌కు పచ్చజెండా ఊపి పంపించనున్నారు. ఇందుకోసం రైల్వే శాఖ ఆధ్వర్యంలో రామగుండం రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడు నెలలవుతున్నా

# ముందుకు కదలరేం?



**గోదావరిఖని:-నవభూమి:** కార్మికుల పిల్లలకు సింగరేణి యాజమాన్యం జారీచేసిన వయోపరిమితి పెంపు అమలు కావడం లేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కరోనా సమయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ పరీక్షలు నిర్వహించడం ఆలస్యం కావడంతో వారి వయోపరితి దాటిపోయింది. దీన్ని ప్రత్యేక పరిస్థితుల కింద గుర్తించి 35 నుంచి 40 ఏళ్లకు వయోపరిమితిని పెంచుతూ యాజమాన్యం ఆదేశాలు జారీచేయగా.. అమలు కావడంలో మాత్రం ఆలస్యం జరుగుతోంది. 40 ఏళ్లు కూడా దాటిపోతున్నాయి! ఇప్పటికే నాలుగేళ్లు నిరీక్షించగా.. దీంతో 40 సంవత్సరాల వయోపరిమితి కూడా దాటిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కొవిడ్-19 సమయంలో రెండేళ్లపాటు మెడికల్ పరీక్షలు నిర్వహించలేదు. కరోనా ముగిసిన రెండేళ్లకు మెడికల్ బోర్డులు ఏర్పాటుచేశారు. అప్పటికే కొంతమంది వారసులకు 35 ఏళ్లు దాటిపోయాయి. దీంతో వారిని ఉద్యోగానికి తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టారు. దీనికి యాజమాన్యం ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించి 40 ఏళ్లకు వయోపరిమితిని సవరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జారీచేసి 3 నెలలు గడిచినా..వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసి మూడు నెలలు గడిచిపోయింది. ఈ ఏడాది జూన్‌లో ఆదేశాలు జారీ చేసిన యాజమాన్యం.. పెండింగ్‌లో ఉన్న వారసులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. దీంతో కార్మికుల పిల్లలు వారి తండ్రులు పనిచేసిన కార్యాలయాల్లో తమ వివరాలు అందజేశారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలకు సంబంధించిన చర్యలు చేపట్టలేదు. దరఖాస్తు చేసుకున్నవారిని ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూస్తున్నారు. 1500 మందికి నిలిపివేత..సింగరేణి వ్యాప్తంగా 1500 మంది వారసులకు వయోపరిమితి పెరిగిన కారణంగా ఉద్యోగాల్లోకి తీసుకోకుండా నిలిపివేశారు. వారికి ప్రత్యేకంగా జారీ చేసిన ఆదేశాలతో ఉద్యోగానికి మార్గం సుగుమం అయిందనే సంతోషం వ్యక్తమైనా.. మళ్లీ మూడు నెలలుగా జాప్యం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన యాజమాన్యం.. దరఖాస్తు చేసుకున్న కార్మికుల పత్రాలు కార్పొరేట్ వరకు మాత్రమే వెళ్లాయి. అక్కడి నుంచి మార్గదర్శకాలు వస్తేనే మిగతా ప్రక్రియ మొదలు పెడతామన్న సమాధానాలు కార్యాలయాల సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

పోడు ఆశ..

# ఆడవితల్లికి గుండెకోత



## గణపయ్య వీడ్కోలుకు సిద్ధం



**కరీంనగర్ –నవభూమి:** కరీంనగర్‌లో సోమవారం జరిగే గణేశ్ నిమజ్జనానికి నగరపాలిక అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.నగర వీధుల్లో, ప్రధాన మార్గాల్లో, వినాయక మండపాల దగ్గర, నిమజ్జనానికి వెళ్లే రహదారులు, ఊరేగింపు మార్గాలు, రద్దీ ప్రాంతాల్లోని రహదారులపై కంకరపొడి పోయించారు. అవసరమున్న చోట సీసీ ప్యాచ్ పనులు చేయించారు. మానకొండూర్, కొత్తపల్లి చెరువులు, చింతకుంట వంతెన (కెనాల్) దగ్గర పనులు పూర్తి చేశారు. నగరంలో వినాయకుల ఊరేగింపుగా వచ్చే రహదారులపై ఇబ్బందులు లేకుండా, కంకరపొడితో గుంతలు లేకుండా పూడ్చారు. టవర్‌సర్కిల్ ప్రాంతంలో వాహనాలకు ఆటంకాలు లేకుండా, లైటింగ్ సౌకర్యం కల్పించారు. నాలుగు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు పూర్తి చేశారు.మూడు చోట్ల నిరంతర పర్యవేక్షణ నిమజ్జనం ప్రాంతాల్లోని మూడు చోట్ల అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మానకొండూర్‌లో రెండు పెద్దవి, రెండు చిన్నవి, కొత్తపల్లి చెరువు దగ్గర ఒకటి పెద్దది, ఒకటి చిన్నది, చింతకుంట దగ్గర ఒకటి పెద్దది, ఒకటి చిన్న క్రేన్లు బిగించనున్నారు.విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా టవర్‌సర్కిల్‌తో పాటు మూడు ప్రాంతాల్లో జనరేటర్లు, ఆయా ప్రాంతాల్లో షామియానాలు, వేదిక, ఎల్ఈడీ వీధిదీపాలు, టవర్లు బిగించారు. చెరువులు, కెనాల్ దగ్గర బారికేడ్లు, తాగునీటి వసతి కల్పించారు.నిమజ్జన స్థలంలోనే పోలీసుల బందోబస్తుకు ప్రత్యేక ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, మైకు సౌకర్యం వంటివి బిగిస్తున్నారు.అత్యవసర సమయంలో వైద్య సౌకర్యం కోసం ప్రత్యేకంగా వైద్య సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉంచనున్నారు.శోభాయాత్ర ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు రహదారులపై ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాలు సోమవారం ఉదయం 10 గంటలకల్లా ముస్తాబు అవుతాయి. ముందుగానే వీధి దీపాలను పరిశీలించారు.ఏర్పాట్లు, నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అధికారులకు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు బాధ్యతలు అప్పగించారు. వీరంతా నిమజ్జనం పూర్తయ్యేవరకు మూడు విడతల్లో ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించనున్నారు.

## లోక కల్యాణార్థం గణపతి హోమం

**మంథని, –నవభూమి:** లోక కల్యాణార్థం గణపతి హోమం నిర్వహించినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తెలిపారు. నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండలాన కోరుకున్నట్లు తెలిపారు. మంథనిలోని రావుల చెరువుక ట్టలో గణపతి శత వసంతోత్సవాల సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయ న సతీమణి, రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ దంప తులు ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డిల వివాదం ఆ పార్టీ అంత ర్గత అంశమని, దాన్ని వాళ్ళే పరిష్కరించుకోకుండా కాంగ్రెస్ పార్టీకి అంటగట్టడం సరికాదన్నారు. ఎవరు ఎంత తెలివైన వారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతిసే ప్రయత్నం చేస్తోందన్నారు. తెలం గాణ రాష్ట్ర ఏర్పడ్డాక ఇక్కడ ఉన్న ప్రజలంతా తెలంగాణ ప్రజలేనన్నారు. హైదరా బాద్ బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామ న్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.



## పోడు ఆశ.. ఆడవితలికి

# గుండెకోత

**రుద్రంగి:–నవభూమి:** జీవనోపాధి లేని నిరుపేద గిరిజన, గిరిజనేతరులకు ప్రభుత్వం పోడు భూములపై హక్కులను కల్పించింది.ఇప్పుడు ఇదే అటవీ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతోంది. శత వసంతాలు విరాజిల్లిన వృక్షరాజాలు, కనువిందు చేసే పచ్చని చెట్లు కోత మిషన్ల ధాటికి కనుమరుగవుతున్నాయి. వన్యజీవులకు ఆవాసంగా ఉన్న ప్రాంతం నేడు చెట్లు లేక వెలవెలబోతోంది.రుద్రంగి మండల కేంద్రం, మండలంలోని ఉమ్మడి మానాలలో దశాబ్దం నుంచి సుమారు 4 వేల ఎకరాల అటవీ ప్రాంతం ప్రస్తుతం పంట చేలుగా మారింది. అటవీ ప్రాంతం చదును చేసే ఇంకా ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. 2023లో అప్పటి భారాస ప్రభుత్వం సుమారు 1,700 ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసింది. ఈ హక్కులు తమకు కూడా వర్తిస్తాయనే ఉద్దేశంతో నిత్యం కోత మిషన్లతో చెట్లను నేల కూల్చుతున్నారు.రుద్రంగి– మానాల అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వందలాది చెట్లను కోత మిషన్లతో కోస్తూ, ట్రాక్టర్లతో చదును చేస్తున్నారు.సహజ అడవులు పునరుద్ధరణలో భాగంగా మానాల– భీంగల్ మధ్య రెండు దశాబ్దాల క్రితం పెంచిన నీలగిరి చెట్లను సైతం ఇటీవల అక్రమార్కులు నరికేశారు.ఉమ్మడి మానాలలో కొందరు సుమారు 30 నుంచి 50 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించినా వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొందరు ప్రజాప్రతినిధులు జిల్లా అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడు.రుద్రంగికి అనుబంధంగా ఉన్న కొచ్చెగుట్ట తండా, గువ్వల బండా తండా, దసరానాయక్ తండా పరిసరాల్లో వందలాది ఎకరాల అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి.ఇలా చేస్తే మేలు..అటవీ ప్రాంతాల్లోకి చదును చేసే వాహనాలు వెళ్లకుండా కందకాలు తవ్వాలి.అన్ని సామాజిక వర్గాలతో అటవీ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి.ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పండ్ల మొక్కలు నాటితే కోతులు మళ్లీ అడవి బాట పట్టేందుకు అవకాశం ఉంటుంది.ఈ చిత్రంలో కనిపిస్తున్నది 2021-22లో కంపా పథకంలో భాగంగా సహజ అడవుల పునరుద్ధరణ పేరిట 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. 2022లో అటవీ భూమి కోతకు గురికావద్దని, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు, భూగర్భ జలాల పెంపు కోసం మూడు నీటి కుంటలను నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ 50 ఎకరాల్లో పత్తి చేను దర్శనమిస్తోంది.జనాల్లోకి వన్యప్రాణులుఅటవీ ప్రాంతం నానాటికీ క్షీణించడంతో సురక్షితమైన ప్రాంతాలు కరవై వన్యప్రాణులు జనావాసాలు, పంట చేలల్లోకి వస్తున్నాయి. చిరుతలు, ఎలుగుబంట్లు, మనుబోతులు, కోతులు, దుప్పిలు, జింకలు, నెమళ్లు వంటివి పంట పొలాల్లోకి తరచూ వస్తున్నాయి.కేసులు నమోదు చేస్తున్నాం మా పరిధిలో అడవుల అన్యాక్రాంతానికి సంబంధించిన కారకులను పట్టుకుని కేసులు పెడుతున్నాం. కొందరిని బైండోవర్ చేశాం. మా సిబ్బంది ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇతర శాఖలు, ప్రజాప్రతినిధుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది.రాఘవేందర్‌రావు, డిప్యూటీ రేంజ్ అధికారి, చందుర్తి నిఘా పెట్టాం మా సామర్థ్యం మేర అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు నిఘా ఉంచాం. ప్రజల మద్దతు ఉంటేనే అడవుల రక్షణ పూర్తిగా సాధ్యమవుతుంది. మానాల–భీంగల్ మధ్యలో ఆక్రమణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశాం. కొందరిని ఇంకా గుర్తించాల్సి ఉంది.





## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

**కళ్యాణ్‌నగర్, –నవభూమి:** మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సం దర్భంగా ఆదివారం రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జీ–1 జీఎం లలిత్‌కుమార్, జైపూర్ పవర్‌ప్లాంట్ జీఎం ఎన్‌కే రాజశేఖర్ హాజరై మాట్లాడారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని అన్నారు. లలిత్‌కుమార్, రాజశేఖర్‌తో పాటు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మినేష్ నారాయణ రండన్‌ను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు ప్ర మోద్‌కుమార్‌రెడ్డి, ఎల్లప్ప, గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్, రామస్వామి, తిలక్‌చక్ర వర్తి, శరత్‌బాబు, ఆంజనేయులు, మనోజ్‌కుమార్, లక్ష్మారెడ్డి, సారయ్య, సుధాకర్, సత్యనారాయణ, వెంకటేశం, బేణిగోపాల్‌త్రివేది, లక్కం బిక్షపతి, కోలేటి శ్రీనివాస్, తిరుపతి, రంగమ్మ పాల్గొన్నారు.



## నేడు గణనాథుల నిమజ్జనం



**కోల్‌సిటీ, –నవభూమి:** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం గణేష్‌నిమజ్జనం జరుగనున్నది. గణపతి నిమజ్జనానికి సింగరేణి, మున్సిపల్ ఆధ్వ ర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నవరాత్రులకు ముందుగానే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సింగరేణి, ఎన్‌టీ పీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, పోలీస్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిమజ్జనానికి ఇబ్బంబదులు కలుగకుండా శాఖలవారీగా పనుల విభజన చేశారు. ఇందుకు అనుగుణంగా సింగరేణి, నగర పాలక సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి. నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథు లను సోమవారం గోదావరి వంతెన నుంచి నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు గోదావరి వంతెన వద్ద వేదికలు ఏర్పాటు చేశారు. ఈ ప్లాట్‌ఫాంల నుంచి గోదావరి లో గణనాథులను నిమజ్జనం చేస్తారు. మొదట 20ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయాల ని నిర్ణయించినా గోదావరిలో ప్రవాహం తక్కువగా ఉండడంతో 16 ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి 14వేల క్యూసెక్కుల నీటిని కిం దకు వదిలారు. గత ఏడాది 580 గణనాథులను ప్రతిష్ఠింగా ఈ సారి 600గణనాథు లను ప్రతిష్ఠించారు. శోభయాత్ర దృష్ట్యా మున్సిపల్, సింగరేణిలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. శోభయాత్ర జరిగే ప్రాంతాల్లోని రోడ్ల గుంతలను పూడ్చారు. సింగరేణి సం స్థ వివిధ కూడళ్లకు సీరిస్ లైట్లను అమర్చించింది. గోదావరిఖని మెయిన్‌చౌరస్తాలో గణనాథులకు స్వాగతం పలుకనున్నాయి. మెయిన్ చౌరస్తాలోనే 300లైట్లతో లైటింగ్ ఏర్పాటుచేశారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా ఎక్స్‌ప్రెస్‌లైన్లను అమర్చారు. అనివార్య పరిస్థితులు ఏర్పడితే ఇబ్బంది కలుగకుండా 60కేవీఏ జనరేటర్ ఏర్పాటు చేశారు. గోదావరి వంతెన వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా ఎక్స్‌ప్రెస్ లైన్ ఏర్పాటుచేయడంతో పాటు 60కేవీఏ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రామగుం డం పారిశ్రామిక ప్రాంతంతో పాటు శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాం తాల నుంచి కూడా గణనాథులు వచ్చే అవకాశం ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. మంగళవారం తెల్లవారు వరకు నిమజ్జనం జరిగే అవకాశం ఉంది.

## డ్రోన్, సీసీ కెమెరాల నిఘాలో నిమజ్జనం

**కోల్‌సిటీ, –నవభూమి:** డ్రోన్లు, సీసీ నిఘాలో గణపతి నిమజ్జ నం జరుగనున్నదని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పే ర్కొన్నారు. పెద్దపల్లి జోన్ పరిధిలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరుగకుం డా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదివారం గోదావరిఖని ప ట్టణంలో నిమజ్జనం జరిగే ప్రదేశాలు, శోభయాత్ర రూట్‌ను పెద్దప ల్లి డీసీపీ చేతన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన సమ యంలో పోలీసుల సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు, ఉత్స వ కమిటీ సభ్యులు నడుచుకోవాలన్నారు. నిమజ్జన సందర్భంగా జిల్లాలోనివివిధ ప్రాంతాల్లో భారీ బందోబస్తు, పోలీస్ పికెట్లు ఏర్పా టు చేశామన్నారు. మొదటి సారిగా కమిషనరేట్‌పరిధిలో శోభా యాత్రపై డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తామన్నారు. ఉత్సవ కమి టీలు త్వరితగతిన పూజలు ముగించుకుని వెలుగుతు ఉండగానే విగ్రహాలను జాగ్రత్తగా నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన ఊరే గింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. సీపీ ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పె క్టర్ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఉన్నారు.



# ఆధునిక యంత్రం.. ఉపాధి అంతంతమాత్రం

**సిరిసిల్ల:–నవభూమి:** ఏళ్ల తరబడి ఒకే వృత్తిని నమ్ముకుని ఉండటం.. అందులోనూ డిటర్జంట్లు.. రసాయనాలు కలిసిన నీళ్లతో దుస్తులు ఉతకడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు.దీని ప్రభావంతో చాలా కుటుంబాలు రజక వృత్తికి దూరమవుతున్నాయి. పైగా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాక వీరికి ఉపాధి కూడా కరవవుతోంది. దీంతో చాలా మంది యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రజకుల్లో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఆధునిక ధోబీఘాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆశయం మంచిదే అయినా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.కొరవడిన ప్రచారం రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా సిరిసిల్ల పట్టణంలో రూ.1.38 కోట్లతో ఆధునిక ధోబీ ఘాట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో రోజుకు రెండు షిఫ్టుల్లో 16 సైకిల్స్‌లో 3,840 దుస్తులు ఉతికి, ఆరేసి, ఇస్త్రీ చేసే వీలుంది. దీని పరిధిలో 30 కుటుంబాలకు నిరంతర ఉపాధి లభిస్తుంది.ప్రస్తుతం రెండ్రోజులకు ఒకసారి కూడా ఒక షిప్టునకు పూర్తిగా సరిపడినన్ని దుస్తులు రావడం లేదు. విస్తరిస్తున్న సాంకేతికత ఓవైపు.. అందుకు తగ్గట్లుగా ప్రచారమూ కొరవడటంతో రజకుల ఉపాధిపైన ప్రభావం చూపుతోంది. ఇక్కడ పూర్తిస్థాయి లక్ష్యం చేరుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా మరో 18 చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.వీటి నిర్వహణకు రాష్ట్రంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ అవి కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలైన వసతి గృహాలు, గురుకులాలు, ఆసుపత్రులు, లాడ్జీల్లో వస్త్రాలు



తీసుకొచ్చి ఉతికి ఇచ్చేలా ధోబీఘాట్‌పై ప్రచారం చేయలేదు. రజకులకు పని భారం తగ్గడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ దుస్తులు ఉతికి ఉపాధిని మరింతగా విస్తరించుకునే అవకాశాలు అందిపుచ్చుకోవడం లేదు.ఆరేసిన దుస్తులు అధికారుల సహకారం అవసరం తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. గురుకులాలు, కళాశాలకు వెళ్లి దీనిపై వివరించాం. వాటిలో పని చేసేవారికి ఆధునిక ధోబీ ఘాట్ సామర్థ్యం గురించి చెప్పాం. వారే నేరుగా దుస్తులు తీసుకొచ్చి ఉతుక్కొని తీసుకెళ్లవచ్చు. వారికి ఉపాధి గిట్టుబాటయ్యేలా మాట్లాడుతామని చెప్పాం. జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలలు, వసతి గృహాలు ఈ ధోబీఘాట్‌ను వినియోగించేలా అధికారులు సహకరించాలి.



# సర్వం సిద్ధం.. సమన్వయంతో ముందుకు

**గోదావరిఖని –నవభూమి:** స్థానిక పరిశ్రమల సహకారం, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో రామగుండంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకునేలా స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో ఇటీవల నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నిమజ్జనానికి సంబంధించిన పలు అంశాలను, గతంలో జరిగిన లోటుపాట్లపై చర్చించారు. ఈసారి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలంటూ పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. ఆయా వర్గాలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను రామగుండం నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుంది.ఏర్పాట్లు ఇలా..నగరంలో పండుగ శోభ వెల్లివిరిసేలా సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ ఆధ్వర్యంలో వివిధ కూడళ్లలో విద్యుత్తు దీపాలతో అలంకరిస్తున్నారు.రాజీవ్ రహదారి నుంచి గోదావరి వరకు రహదారికి ఇరువైపులా రోడ్డుపైకి వచ్చిన చెట్టు కొమ్మలను ఎన్‌పీడీసీఎల్ అధికారులు తొలగించడం.. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా గోదావరి వంతెన, ప్రధాన కూడలిలోని వేదిక వద్ద అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.నిమజ్జనం జరిగే సోమవారం ఉదయం 10 నుంచి బొగ్గు లారీలు తిరగకుండా సింగరేణి, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది చర్యలు తీసుకోనుంది. సింగరేణి సహకారంతో నగరంలోని గోతులను పూడ్చే బాధ్యతను రామగుండం నగరపాలక సంస్థ చేపడుతుంది.గోదావరి వంతెన వద్ద సింగరేణి నాలుగు క్రేన్లను ఏర్పాటు చేయనుంది.మంచిర్యాల వైపునుంచి కూడా వచ్చే అవకాశమున్నందున 20 ప్లాట్ఫారాలను ఏర్పాటు చేయనున్నారు. గోదావరిలో లోతు వరకు వెళ్లకుండా బారికేడ్లను పెడుతున్నారు.అకస్మాత్తుగా వినాయక విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలు రోడ్డు మధ్యలో ఆగిపోతే వెంటనే తరలించేలా మెకానిక్‌లను అందుబాటులో ఉంచనున్నారు. జెన్‌కో సహకారంతో రామగుండంలో నిమజ్జన ఏర్పాట్లు చేపట్టనున్నారు.నిర్వాహకులు సహకరించాలి గోదావరిలో గణపతి నిమజ్జనం కోసం ఏర్పాట్లను చురుగ్గా చేపడుతున్నాం. స్థానిక పరిశ్రమలు, వివిధ శాఖల అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వారికి అప్పగించిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. పోలీసులు, ఉత్సవ సమితితోపాటు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ మండపాల నిర్వాహకులు ప్రశాంత నిమజ్జనానికి సహకరించాలి.

